ఓటు వేస్తే ఉచితంగా థైరాయిడ్ టెస్ట్

పోచమ్మమైదాన్, మే 12: ఓటుహక్కు వినియోగించుకున్న వారికి ఉచితంగా థైరాయిడ్ టెస్ట్ చేయనున్నట్లు నిర్వాహకులు చెట్లపల్లి నరేందర్ తెలిపారు. హనుమకొండలోని సిరి మెడికేర్ థైరోకేర్ సెంటర్‌లో సోమ, మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష చేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 98490 62827లో సంప్రదించాలని సూచించారు.

'చాంబర్' ఎన్నికల బరిలో నిలచింది వీరే..

కాశీబుగ్గ, మే 12: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ 2023-26 ఎన్నికల బరిలో నిలిచిన వారి పేర్లను ఎన్నికల అధికారి తాబేటి శ్రీధర్ ప్రకటించారు. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉండగా, పలువురు విరమించుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మొగిలి చంద్రమౌళి, గౌరవ ప్రధాన కార్యదర్శిగా మడూరి వేదప్రకాశ్, సంయుక్త కార్యదర్శిగా సాగర్ల శ్రీనివాస్, కోశాధికారిగా అల్లె సంపత్, కార్యవర్గ సభ్యులుగా గాజుల సుమన్, కంచ సంతోషం, గౌరిశెట్టి శ్రీనివాస్, కైలాస హరినాథ్, సూదాటి రాజేశ్వర్ రావు పోటీలో నిలిచినట్లు పేర్కొన్నారు. అయితే, హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం వీరి ఎన్నికను అధికారికంగా ప్రకటించలేకపోతున్నట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు.

పారిశుధ్య కార్మికులకు చీరెల పంపిణీ

హసన్‌పర్తి, మే 12: మదర్స్‌డే సందర్భంగా ఒకటో డివిజన్ పరిధిలోని ముచ్చర్లలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి తల్లి పూలమ్మ జ్ఞాపకార్థం పారిశుధ్య కార్మికులు, ఆశ వర్కర్లకు ఆదివారం చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీధర్, మోహన్‌రెడ్డి, ప్రమోద్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గిర్మాజీపేట, మే 12: రామన్నపేట రఘునాథకాలనీలో మాడిశెట్టి రాజయ్య అనారోగ్యంతో ఆదివారం మరణించాడు. విషయం తెలుసుకున్న పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్ రావు రాజయ్య దహన సంస్కారాల కోసం రూ. 4 వేల ఆర్థిక సాయం అందించారు.

రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి కూల్చివేత

కాజీపేట, మే 12 : కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై ఉన్న పురాతన రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కూల్చివేత పనులకు ఆదివారం అధికారులు శ్రీకారం చుట్టారు. కాజీపేట రైల్వే స్టేషన్ గతంలో అమృత్ పథకానికి ఎంపిక కాగా, అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా దాదాపు వందేళ్ల క్రితం నిర్మించిన రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగిస్తున్నారు. రైల్వే ఓహెచ్ఈ విద్యుత్ ప్రసారాన్ని రెండుగంటల పాటు నిలిపివేసి ఇనుప బ్రిడ్జిని వెల్డింగ్ కట్టర్‌లతో కట్ చేశారు. ఈ బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి, ఎస్కులేటర్, లిఫ్ట్ నిర్మించనున్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్లు
- ఎస్కార్ట్ మధ్య పోలింగ్ కేంద్రాలకు బస్సుల తరలింపు

కాశీబుగ్గ/హనుమకొండ, మే 12 : నేడు జరుగనున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఎనుమాముల మార్కెట్ పరిధిలో ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను ఆదివారం ఆమె ఎన్నికల సాధారణ పరిశీలకుడు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వరంగల్ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 230 పోలింగ్ కేంద్రాలకు 21 రూట్లు, వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో 279 పోలింగ్ కేంద్రాలకు 37 రూట్లలో బస్సు రూట్‌మ్యాప్ ఆధారంగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ఎన్నికల సామగ్రితో తరలించినట్లు తెలిపారు. సెక్టోరియల్ అధికారుల సమక్షంలో కేటాయించిన రూట్లలో ప్రతి బస్సుకు పోలీసులు ఎస్కార్ట్‌గా వెళ్లినట్లు చెప్పారు. ఎనుమాముల మార్కెట్‌లో వరంగల్‌తూర్పు, వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్ల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఈవీఎంలు, వీవీప్యాట్ల పంపిణీ ఏర్పాట్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఏఆర్‌వోలు, అశ్వినీ తానాజీ వాకడ్, సిదం దత్తు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, విజయ్‌సాగర్ పాల్గొన్నారు.

హనుమకొండ : ఎనుమాముల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నర్సంపేట : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పోలింగ్ సామగ్రిని తీసుకుంటున్న అధికారులు

అలాగే, వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గానికి చెందిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్ పరిశీలించారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి పంపిణీ కోసం చేసిన ఏర్పాట్లను ఆమె పరిశీలించి అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఏఆర్వోలు నారాయణ, వెంకటేశ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నట్లు తెలిపారు. ఏఆర్‌వో నారాయణ, ఏసీపీ కిశోర్ కుమార్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. కాగా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 244 పోలింగ్ కేంద్రాలుండగా 2,83,446 మంది ఓటర్లు, పరకాల నియోజకవర్గంలో 239 పోలింగ్ కేంద్రాలుండగా 2,22,383 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

నర్సంపేటలో..

నర్సంపేట : నర్సంపేట నుంచి పోలింగ్ అధికారులను సామగ్రితో పటిష్ట భద్రత నడుమ పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఆదివారం ఉదయం నర్సంపేటలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఉన్న కేంద్రంలో రిపోర్టు చేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా సిబ్బందికి సామగ్రిని అందించారు. మధ్యాహ్నం రూట్ల వారీగా కేటాయించిన బస్సుల్లో ఆయా కేంద్రాలకు సిబ్బంది తరలివెళ్లారు. నర్సంపేట నియోజకవర్గంలో 2,35,849 మంది ఓటర్లకు 283 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1350 మంది పోలింగ్ అధికారులు, 23 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. నర్సంపేట ఆర్డీవో కృష్ణ వేణి, తహసీల్దార్ విశ్వప్రసాద్ ఏర్పాట్లు చేశారు.

మాజీ ఎమ్మెల్యే చల్లా సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న రాంపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు

భవిష్యత్ బీఆర్ఎస్‌దే..

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

బీఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ నాయకులు

గీసుగొండ, మే 12 : పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని, వచ్చే రోజులన్నీ బీఆర్ఎస్ పార్టీదేనని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని రాంపురం గ్రామనికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి చల్లా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ వీడుతున్నారని, వారితో పార్టీకి వచ్చే నష్టమేమీ లేదన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. ప్రజల కోసం పనిచేసే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు తెలంగాణలో కరెంటు, నీళ్లు పుష్కలంగా వచ్చేవని, ఇప్పుడు రాష్ట్రంలో నీళ్లు, కరెంటు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పులి శంకర్‌రావు, పులి రవి, అనిల్, చిలుపూరి రవి, రాజు, భిక్షపతి, పసుల రాజుతో పాటు మరో 20 మంది చేరారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు.

వెంకటయ్య కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

బాధిత కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ

పర్వతగిరి, మే 12: అన్నారం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు బత్తిని వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం గ్రామానికి చేరుకొని వెంకటయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వేడుకల్లో పాల్గొన్న ఆర్ఎంవో శ్రీనివాస్, నర్సింగ్ అధికారులు

పేద ప్రజలకు సేవలు అందించాలి

పోచమ్మమైదాన్, మే 12 : ఫ్లారెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో పేద ప్రజలకు సేవలు అందించాలని ఎంజీఎం ఆర్ఎంవో శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఎంజీఎం నర్సింగ్ వసతి గృహం ఆవరణలోని ఫ్లారెన్స్ నైటింగేల్ మాత విగ్రహం వద్ద ఆదివారం వేడుకలు నిర్వహించారు. గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, గ్రేడ్-2 సూపరింటెండెంట్ రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బేబీ సరళ పాల్గొన్నారు.

బ్యాంకు కాలనీలో వృద్ధురాలికి సన్మానం

పోచమ్మమైదాన్, మే 12 : మాతృ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బ్యాంకుకాలనీలో నివాసముంటున్న 85 వృద్ధురాలికి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తల్లులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు ప్రేమ పంచాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. కార్యక్రమంలో బ్రహ్మదేవుల సోమలింగం, మంతెన రాజేశ్, వేణుగోపాల్, లలిత, సాయి మోహిత్, రజినీకాంత్, ప్రభావతి, లక్ష్మి పాల్గొన్నారు.

పోలింగ్‌కు భారీ బందోబస్తు

ఏసీపీ కిశోర్ కుమార్

శాయంపేట, మే 12 : సోమవారం జరిగే లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పరకాల ఏసీపీ కిశోర్ కుమార్ తెలిపారు. ఆదివారం శాయంపేట పోలీస్‌స్టేషన్లో 60మంది పోలీసు అధికారులు, సిబ్బందికి విధులు అలాట్ చేసి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పోలీసులతో పాటు బీఎస్ఎఫ్ దళాలను పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు పెట్టామన్నారు. కార్యక్రమంలో సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై ప్రమోద్ పాల్గొన్నారు.

పోలీసులతో మాట్లాడుతున్న ఏసీపీ కిశోర్ కుమార్

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

ఖానాపురం, మే 12: కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలైన ఘటన అశోక్‌నగర్‌లో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన గండికోట లచ్చమ్మ తన ఇంటి ముందు మంచంపై నిద్రిస్తుండగా కోతుల గుంపు ఆకస్మాత్తుగా దాడి చేసి తల, చేతులపై తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను నర్సంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బస్సును ఢీకొట్టిన కారు

ఖానాపురం, మే 12: ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటన మండలంలోని పాకాల సంగెం కాల్వ వద్ద జరిగింది. కొత్తగూడ నుంచి నర్సంపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఆదివారం పాకాల సంగెం కాల్వ సమీపంలోకి రాగానే గిరకతాళ్లకు వెళ్లేదారి నుంచి కారు వేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొన్నది. కారులో ఉన్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పెను ప్రమాదం తప్పడంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రైల్వే ప్లాట్‌ఫారంపై వృద్ధుడి మృతి

కాజీపేట, మే 12 : కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై ఆదివారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. స్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫారంపై గుర్తు తెలియని వృద్ధుడు ఎంత తీవ్రతను తట్టుకోలేక మరణించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు (70) వయస్సు, 6'5 ఎత్తు ఉన్నాడన్నారు. మృతుడు భిక్షాటన చేసే జీవించేవాడని, రాత్రి వేళల్లో రైల్వే ప్రాంగణంలో నిద్రించేవాడని స్థానికులు తెలిపారన్నారు. పంచనామా చేసి మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచామని తెలిపారు.

నగరంలో భారీ వర్షం

- గంట పాటు దంచి కొట్టిన వాన
- రహదారులు జలమయం
- కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు

వరంగల్, మే 12 : వరంగల్ నగరంలో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి గంట పాటు వాన దంచి కొట్టింది. ఉదయం నుంచి తీవ్ర ఉష్ణోగ్రతతో అల్లాడిపోగా రాత్రి కురిసిన వర్షానికి నగరం చల్లబడింది. కుండపోతగా కురిసిన వర్షంతో నగర రహదారులు నీటిలో మునిగిపోయాయి. అనుకోకుండా కొట్టిన వానతో ప్రజలు ఎక్కడికక్కడ నిలిచిపోయారు. నగర రహదారులపై మోకాలి లోతులో నీరు నిలువడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని వరంగల్ చౌరస్తా, వేంకటేశ్వరస్వామి దేవాలయం, అండర్‌బ్రిడ్జి, హనుమకొండ చౌరస్తా, బస్ స్టేషన్ ప్రాంతాలు వర్షం నీటితో నిండిపోయాయి.

కరెంట్ లేక ఇబ్బందులు

నగరంలో గంటపాటు వాన కొట్టడంలో అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు రోడ్డుపై ప్రయాణంతో ఇబ్బందులు పడ్డారు. వర్షం నిలిచిపోయే వరకూ కరెంట్ రాక పోవడంతో బిక్కుబిక్కుమంటూ గడిపారు

వరంగల్ నగరంలో జోరుగా కురుస్తున్న వాన

నూతన ఓటర్లకు యువ పోలింగ్ కేంద్రం

పోచమ్మమైదాన్ : కొత్త ఓటర్లను ఆకర్షించేందుకు యువ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య అన్నారు. వరంగల్-15 తూర్పు అసెంబ్లీ నియోజవర్గ పరిధిలోని సీకేఎం కళాశాలలో పూర్తిగా యువతతో నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం ఆమె పరిశీలించి, తగిన సూచనలు చేశారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి సెగ్మెంట్‌లో ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలు, ఒక దివ్యాంగ కేంద్రం, ఐదు మోడల్ కేంద్రాలు, ఒక యువ పోలింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా సీపీ నోడల్ అధికారి భాగ్య లక్ష్మి, అయుబ్ అలీ, కౌసల్య, రవికుమార్ పాల్గొన్నారు.

పోచమ్మమైదాన్ : యువ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రావీణ్య

పోలింగ్ కేంద్రాల పరిశీలన..

హనుమకొండ : హనుమకొండలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్, ఫాతిమానగర్‌లోని సెయింట్ గ్యాబ్రియల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాలను హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. సెయింట్ గ్యాబ్రియల్ పాఠశాలలో దేశంలో 1951లో జరిగిన ఎన్నికలు మొదలుకుని ఎన్నికల నిర్వహణకు సంబంధించిన చారిత్రక దృశ్యాలతో కూడిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వివరాలను మోడల్ పోలింగ్ కేంద్రం ఇన్‌చార్జి, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్ కలెక్టర్‌కు వివరించారు. సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వర్తించే మహిళా సిబ్బంది ప్రత్యేకంగా తయారుచేసిన తలపాగాలు ధరించడంతో కలెక్టర్ అభినందనలు తెలిపారు. జిల్లాలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మోడల్ పోలింగ్ కేంద్రాల గురించి డీఆర్డీవో నాగ పద్మజ కలెక్టర్‌కు వివరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, the undersigned **RONDLA SRIKAR REDDY** (New Name), previously called **RONDLA S REDDY** (Old Name), and residing at # H.No. 1-1-490/1/111/402, Rachana Nilayam, Chaithanya Puri Colony, Warangal-Hanumakonda - 506004.
NTW-00

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-323227

RECRUITMENT

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

సంగెం : ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న సిబ్బంది

ఖానాపురం : పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామగ్రితో వెళుతున్న సిబ్బంది

రాయపర్తి : పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది

పోలింగ్ కేంద్రాలకు చేరిన సామగ్రి

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్ : వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఖానాపురం మండల వ్యాప్తంగా 30 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఒక్కో సెంటర్‌కు నలుగురు సిబ్బంది ఎన్నికల సామగ్రితో చేరుకున్నట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. వర్ధన్నపేట మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేందాద్రాలను సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. చెన్నారావుపేట మండలంలో 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారి ఫణికుమార్ తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఐనవోలు మండలంలో 30,338 మంది ఓటర్లకు 35 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. నేడు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు కోరారు. రాయపర్తి మండలంలోని 39 గ్రామ పంచాయతీల పరిధిలో సోమవారం జరుగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ తెలిపారు. 52 పోలింగ్ కేంద్రాల్లో 521 మంది సిబ్బంది విధులు నిర్వర్తించనున్నట్లు చెప్పారు. ఎస్సై వడ్డే సందీప్‌కుమార్ సారథ్యంలో సీఆర్ఎఫ్ బలగాలు పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా ఏర్పాటు చేశారు. మండలంలో 16 గ్రామాల్లో 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్లు 28,357 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 13,768 మంది ఉండగా, 14,589 మంది మహిళలు ఉన్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో అధికారులు వచ్చినట్లు పేర్కొన్నారు. గీసుగొండ మండలంతో పాటు గ్రేటర్ 15,16వ డివిజన్లలో ఎన్నికల నిర్వహణకు అధికారులు 52 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. మొత్తం 51,123 మంది ఓటర్లు ఉండగా అందులో 24960 మంది పురుషులు, 26163 మంది మహిళలు ఉన్నట్లు తహసీల్దార్ రీయాజుద్దీన్ తెలిపారు. మండలాన్ని మూడు రూట్‌లుగా విభజించామని, ఎన్నికల నిర్వహణ కోసం 312 మంది అధికారులు విధుల్లో ఉంటారని, 80 మంది పోలీసులు బందోబస్తులో ఉంటారని తెలిపారు. సంగెం మండలంలోని 33 జీపీల్లోని 44 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. మండలంలో 39,996 మంది ఓటర్లు ఉండగా పురుషులు 19559, స్త్రీలు 20,437 మంది ఉన్నారు. ఎన్నికల బందోబస్తు కోసం కేంద్ర బలగాలతో పాటు లోకల్ పోలీసులు విధులను నిర్వహిస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

ఐనవోలు : బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్సై అనిల్‌కుమార్

ఐనవోలు : పెరుమాండ్లగూడెంలో పోలింగ్ కేంద్రానికి చేరిన సిబ్బంది

చెన్నారావుపేట : ఈవీఎంలతో పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బంది

వర్ధన్నపేట : పట్టణానికి చేరుకున్న ఈవీఎంలు, ఎన్నికల అధికారులు

గీసుగొండ : మొగిలిచెర్ల పోలింగ్ కేంద్రానికి చేరుకున్న అధికారులు

ఆత్మకూరు : ఎన్నికల సామగ్రితో వస్తున్న అధికారులు